



సభకు భారీగా హాజరైన జనం

# దద్దరిల్లేలా..

## ప్రజా ఆశీర్వాద సభ!

### మహేశ్వరం నియోజకవర్గంలో..

## కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణం

***జోరున వర్షం.. సభలో ఓపిగ్గా జనం***

- **సుల్తాన్‌పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్**
- **జన జాతరతో నలువైపులా కిక్కిరిసిన రహదారులు**
- **దారులన్నీ గులాబీ మయం**
- **సభ సక్సెస్‌కు అన్నీ తానై వ్యవహరించిన మంత్రి సబిత, మంత్రి తనయుడు కార్తీక్ రెడ్డి**

రంగారెడ్డి, నవంబర్ 23(నమస్తే తెలంగాణ)/ బడంగ్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ' విజయవంతమైంది. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభంజనం సృష్టించారు.

ఊర్లకు ఊర్లే ఉదయాన్నే ఇల్లు కదిలి.. దండులా రావడంతో నియోజకవర్గం ఆసాంతం తరలివచ్చినట్లుగా కనిపించింది. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి సబితా ఇంద్రారెడ్డి విజయం ఖాయమైందన్న భావనను కల్పించారు. సీఎం సభ మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కాగా.. ఉదయం 9 గంటల నుంచే ప్రజలు భారీగా రావడంతో 11 గంటలకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. వర్షంలోనూ వరదలా జనం తరలిరావడంతో సభా ప్రాంగణం బయటే వేలాది మంది ఉండాల్సి వచ్చింది. సభా ప్రాంగణం చుట్టూ ఉన్న రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

***ఆకట్టుకున్న సీఎం ప్రసంగం..***
***ఈలలు, చప్పట్లలో మద్దతు..***

సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. వర్షం జోరుగా కురుస్తున్నప్పటికీ జనం ఓపికగా సీఎం ప్రసంగాన్ని ఆలకించారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు చప్పట్లు, ఈలలతో మద్దతు పలికారు.

**ఉట్టిపడిన సాంస్కృతిక ప్రదర్శనలు..**

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కులవృత్తుల వేషధారణలు, బతుకమ్మలు, బోనాలతో మహిళలు తరలివచ్చారు. నృత్యాలు చేస్తూ సబ్బండ వర్గాల వారు సమూహాలుగా తరలివచ్చి సందడి చేశారు. ధూంధాం పాటలు సభికులను ఉర్రూతలూగించాయి.

**సభ సక్సెస్‌కు అన్నీ తానై వ్యవహరించిన మంత్రి..**

మహేశ్వరం నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ సక్సెస్ కావడంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషి ఫలించింది. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే మంత్రితోపాటు ఆమె కుమారుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సభ సక్సెస్‌కు తమవంతు పాత్ర పోషించారు. సభా స్థలం ఎంపిక నుంచి ఏర్పాట్లు, జన సమీకరణ అన్నింటిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.





సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, డివిజన్ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గుప్తా



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి



భారీగా తరలివస్తున్న జనం

## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే బీఆర్ఎస్ లక్ష్యం




అల్కాపురిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 23 : పట్టణాల రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పారిశుధ్యం, మంచినీటి సరఫరా, రహదారుల నిర్వహణ, పచ్చదనం, నర్సరీల ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం, పబ్లిక్ టాయిలెట్ల కోసం అవసరమైన స్థలాల గుర్తింపు వంటి చర్యలను చేపట్టిందన్నారు. ఎల్బీనగర్ ప్రాంతంలో వచ్చిన ఫ్లై ఓవర్‌లు, అండర్‌పాస్‌లతో సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ల ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి లభించిందని తెలిపారు. స్థానికంగా అధునాతనమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించబోతున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల కోసం బస్తీ దవాఖానలు ప్రారంభించి.. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.